

# తండ్రి గారి సందేశం....

## మారు మనస్సు లేని విశ్వాస ప్రకటనను ఇష్టపడని యేసు ప్రభువు

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

విశ్వాస ప్రకటన మరియు మారు మనస్సు ఏ విధంగా ముడిపడి ఉన్నాయో అని యేసు ప్రభువు దుష్టాత్మను వెడలగొట్టిన అద్భుతము (మార్కు సువార్త 1,21-28) ఆధారంగా మనం ధ్యానిద్దాం.

ఈ అద్భుతం జరిగిన రోజు సబ్బాతు దినం. యూదులకు సబ్బాతు దినం (విశ్రాంతి దినం) ప్రధానమైన రోజు. ఆ రోజును ప్రార్థనకు, విశ్రాంతికి మాత్రమే కేటాయించేవారు. వారి నియమము అనుసరించి ప్రాయం కలిగిన పురుషులందరూ ప్రార్థన మందిరమునకు వెళ్ళేవారు. పరిశుద్ధ లేఖనాలను చదివిన తరువాత బోధకుడుగాని, ప్రార్థన మందిరపు అధికారి కాని ప్రసంగించేవారు. ప్రార్థన మరియు ఆశీర్వాదము తరువాత అందరూ తిరిగి ఇంటికి వెళ్ళేవారు. కాని ఈ సంఘటన జరిగిన రోజు ప్రార్థన కార్యక్రమాలు సరిగా కొనసాగలేదు అని ఈ సువార్త భాగంలో చూస్తున్నాము.

ఆ సబ్బాతు రోజున నజరేతు నివాసియైన యేసు ప్రసంగించారు. నజరేతు గ్రామం కఫర్నాము పట్టణము నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. యేసు ప్రభు ప్రసంగించిన ఆ ప్రార్థన మందిరం కఫర్నాములో ఉంది. ఈ ప్రదేశములకు మధ్య ఉన్న దూరం తక్కువైనందుకు యేసు ప్రభువును గురించి కఫర్నాములోని వారికి తెలిసియుండవచ్చు. యేసు యూదుల ధర్మశాస్త్రంలో ప్రావీణ్యం పొందలేదని వారికి తెలుసు. అయినప్పటికీ, యేసు ప్రభు యూదుల ధర్మశాస్త్రం గురించి అధికారికంగా ప్రసంగించటం వారు విన్నారు. ఆ విధంగా ప్రసంగిస్తున్న సమయంలో అపవిత్రాత్మ ఆవేశించిన ఒకడు కేకలు వేస్తూ “నజరేతు నివాసియగు యేసు! మాతో నీకేమి పని? మమ్ము నాశనము చేయ వచ్చితివా? నీవు ఎవరివో నేనెరుగుదును. నీవు దేవుని పవిత్రమూర్తివి” (మార్కు 1,24) అని అరిచాడు. దీనిని విన్నవారందరూ దిగ్భ్రాంతికి గురి అయ్యారు.

ప్రతిసారి ప్రార్థన మందిరమునకు వచ్చే దయ్యం పట్టిన వ్యక్తిని గురించి వారందరికి తెలిసియుండవచ్చు. ప్రార్థనా సమయంలో మౌనంగా ఉండి ఆరాధించే ఈ వ్యక్తి అకస్మాత్తుగా కేకలు వేయటం ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ వ్యక్తికి అపవిత్రాత్మ పట్టిందని వారు గ్రహించారు. అపవిత్రాత్మ పట్టిన వ్యక్తి “నీవు దేవుని పవిత్ర మూర్తివి” అని అనటం ద్వారా యేసు ప్రభు దేవుని కుమారుడని ఆయన ప్రకటిస్తున్నాడు. దైవ రాజ్యాన్ని స్థాపించడానికి మరియు సాతానుకు ఈ లోకంపై యున్న అధికారాన్ని అంతమొందించడానికి యేసు ప్రభువు ఈ భూలోకానికి వచ్చాడని ఆ వ్యక్తికి తెలుసు. ఇది నిజంగా విశ్వాస

ప్రకటనే. ఆయన తన విశ్వాసాన్ని ప్రకటించాడు. కాని యేసు ప్రభువు అతనిని మాట్లాడవద్దని ఆదేశించాడు. ఎందుకు యేసు ప్రభువు అతనితో “నోరు మూసుకొని వీని నుండి వెడలిపొమ్ము” అని అన్నారు. ఎందుకు యేసు అపవిత్రాత్మ పట్టిన వ్యక్తిని నిశ్శబ్దంగా ఉండమని ఆదేశించారు. మార్కు సువార్తలో, చాలా మంది వ్యక్తులను యేసు తన గురించి ప్రకటించవద్దని ఆదేశిస్తున్నారు. స్వస్థత పొందిన వారితో వారు పొందిన స్వస్థతను గురించి చెప్పవద్దని, తాను చేసిన పనులను బయలు పరచవద్దని యేసు ప్రభు ఆదేశించారు. ఎందుకు యేసు ప్రభువు ఈ విధంగా చేస్తున్నారు? మార్కు సువార్త మనకు నేర్పించే ఒక సత్యం ఉంది. మారు మనస్సును, పశ్చాత్తాపాన్ని కలిగించని ఏ విశ్వాస ప్రకటనైనా అర్థరహితం. మారు మనస్సును కలిగించని ఏ విశ్వాస ప్రకటన యేసు ప్రభుకు నచ్చదు. దాని వల్ల ఏ ఉపయోగం ఉండదు.


యేసు ప్రభు తన శిష్యులతో ఆ దివ్యరూప ధారణను గురించి తన పునరుత్థానం వరకు ఎవ్వరితో చెప్పవద్దని ఆదేశించారు (మార్కు 9,9) యేసు ప్రభువు మరణం మరియు పునరుత్థానం ద్వారా మాత్రమే యదార్థమైన యేసు ప్రభుని వ్యక్తిత్వాన్ని మనం గ్రహించవచ్చు. యేసు ప్రభు చేసిన అద్భుతాలు, ఆయన చేసిన బోధనలు యేసు ప్రభుని యదార్థమైన వ్యక్తిత్వాన్ని మనకు అందించాయి. కాని వాటి ద్వారా మనకు తెలిసిన సత్యం సగం మాత్రమే. యేసు ప్రభువును నిజంగా, యధార్థంగా, సంపూర్ణంగా తెలుసుకోవాలంటే ప్రతి ఒక్కరు తన సిలువనెత్తుకొని ఆయన వెంబడి నడిచి సిలువ చెంతకు చేరాలి. ఈ విషయాన్ని మార్కు గారు శతాధిపతి ద్వారా మనకు తెలియ జేస్తున్నారు. సిలువ క్రింద ఉన్న శతాధిపతి తన విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు. “యేసు ప్రాణము విడుచుటను చూచి అచట నిలిచియున్న శతాధిపతి ‘నిస్సందేహముగా ఈయన దేవుని కుమారుడే’ అని పలికెను” (మార్కు 15, 39).

మారు మనస్సులేని విశ్వాస ప్రకటన, సిలువను మోసుకొని వెంబడించలేని బహిరంగ విశ్వాస చాటింపు యేసు ప్రభు దృష్టిలో విలువలేనివి. అందుకనే యేసు ప్రభువు అపవిత్రాత్మ పట్టిన వ్యక్తిని నిశ్శబ్ధంగా ఉండమని ఆదేశించాడు. అపవిత్రాత్మ పట్టిన వ్యక్తి ప్రకటించింది నిజమైన విశ్వాస సత్యం. ఆ యదార్థమైన విశ్వాస సత్యం మారు మనస్సు కలిగించకపోతే ఎందుకు పనికిరాదు. దేవుని రాజ్యాన్ని స్థాపించడం మరియు మానవుని దేవునితో సఖ్యపరచడం కొరకు యేసు ప్రభువు ఈ భూలోకానికి వచ్చాడు. అలా కాకుండా యేసు ప్రభువు ఈ భూలోకంలో చేసిన అద్భుతాలు అందరు తెలుసుకోవాలని, తద్వారా తనను రాజుగా అందరు పొగడాలని ఆయన అనుకోలేదు. భౌతికమైన రాజ్యాన్ని స్థాపించడం కొరకు లేదా భౌతికమైన గౌరవమర్యాదలు పొందడానికి యేసు ప్రభు రాలేదు. ఒక వ్యక్తి పశ్చాత్తాపపడి సువార్తను విశ్వసించి యేసును వెంబడించినప్పుడే విశ్వాస ప్రకటనకు అర్థం ఉంటుంది. అపవిత్రాత్మలు కూడా యేసు ప్రభువును విశ్వాసించాయి. యేసు ప్రభువు గొప్పతనం గురించి మనకంటే వాటికి ఎక్కువ తెలుసు. మన విశ్వాసం కన్నా వాటి విశ్వాసం చాలా గొప్పది. “దేవుడు ఒక్కడేనని నీవు విశ్వసింతువు గదా? మంచిదే! పిశాచములును విశ్వసించును. భయముతో గజగజలాడును” (యాకోబు 2,19) కాబట్టి నోటి ద్వారా మనం ప్రకటించేది మారు మనస్సు ద్వారా, మన చేతల ద్వారా, సాక్ష్యం ద్వారా నిరూపింపబడాలి.

కేవలం ప్రకటించడమే యేసు ప్రభువు కోరుకున్నట్లయితే మారు మనస్సుకు, సిలువ మరణానికి అర్థం ఉండదు. కాబట్టి బహిరంగ విశ్వాస ప్రకటనతో సహ పశ్చాత్తాపం కలిగిన జీవితం, అందరితో కలిసి మెలసి ఉండే జీవితం, దేవునితో సఖ్యపడే జీవితం లేకపోయినట్లయితే విశ్వాస ప్రకటనకు అర్థం ఉండదు. కాని పైన చెప్పిన ఏవి లేకుండా కేవలం గొంతెత్తి విశ్వాసాన్ని ప్రకటిస్తానంటే యేసు ప్రభు మనతో కూడా "నోరుమూసుకోమని" (మార్కు 1,21) హెచ్చరిస్తారు. మనం ఆత్మ పరిశీలన చేసుకుందాం. మారు మనస్సు పొంది విశ్వాసములో ఎదిగి ధైర్యముతో విశ్వాసాన్ని ప్రకటిద్దాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



## ధ్యాన కేంద్ర నిర్మాణము కొరకు ప్రార్థన

ప్రభువా, నీ నామ మహిమ కొరకు మరియు ఆదిలాబాద్ గురుపీఠంలో సువార్త వ్యాప్తి కొరకు నిర్మించబడుతున్న ధ్యానకేంద్రాన్ని ఆశీర్వదించండి. ఎటువంటి ఆటంకములు లేకుండా దానిని సకాలంలో పూర్తి చేయుటకు తద్వారా మీ సువార్తను ప్రకటించుటకు మాకు అనుగ్రహం దయచేయమని ప్రార్థించుచున్నాము. ఆమెన్.